
www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం 18 జనవరి 2023





'కండలేరు' జలాశయం సందర్శన



ప్రజాశక్తి-రాపూరు

పెన్నా పరివాహక ప్రాంతాల్లోని జలాశయాలు సందర్శనలో భాగంగా మంగళవారం కండలేరు జలాశయాన్ని కృష్ణ రివర్ బోర్డ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ మహేంద్ర ప్రతాప్ సింగ్, ఈఈ శివ శంకరయ్య సందర్శించారు. కండలేరుకు చేరుకున్న ఆయనకి కండలేరు, సోమశిల ఎస్ఇలు హరి నారాయణరెడ్డి, రమణా రెడ్డిలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వ తదితర అంశాలపై చర్చించారు. పెన్నా పరివాహక జలాశయం నుంచి చెన్నైకి విడుదల చేసే నీటి వివరాలు, ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో నిల్వలు గురించి చర్చించారు. అనంతరం సత్య సాయి గంగ కాలువను పరిశీలించారు. తెలుగుగంగ ఎస్ఇ హరి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతేడాది కండలేరు నుంచి చెన్నైకి 12 టిఎంసిల నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ ఏడాది 4.8 టిఎంసిల నీరు చెన్నైకి విడుదల చేశామన్నారు.వర్షాల కారణంగా చెన్నైలో నీరు ఉండడం వల్ల 11.1 టీఎంసీల నీటిని నిలుపుదల చేశామన్నారు.చెన్నై ప్రాంత వాసులకు ఎప్పుడు నీరు అవసరమైన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కండలేరు, సోమశిల ఈఈలు విజయ కుమార్ రెడ్డి, దశరథ రామి రెడ్డి, డిఇలు ముని వేణు, సుబ్రహ్మణ్యేశ్వర రావు, బాబయ్య, ఎఇలు తిరుమలయ్య, గోపి కృష్ణ, సాయి ప్రతాప్, చిట్టి బాబు, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ'లో 'అవినీతి' కుదుపు..!

- రూ.1.50 కోట్లు పరిహారం మిగేశారు
- ముగ్గురు తహశీల్దార్లు సస్పెన్షన్
- అధికారుల్లో కలవరం


ప్రభుత్వ భూములను కాజేసి, పరిహారాన్ని దిగమింగిన ముగ్గురు తహశీల్దారులపై సస్పెన్షన్ వేటు పడింది. కలువాయి మండలంలో పనిచేసి ఇతర చోట్ల తహశీల్దారులుగా పనిచేస్తున్న వారిపై కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకున్నారు. కలువాయి మండలం, చౌటుపల్లి రిజర్వాయర్ భూసేకరణలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. 30 ఎకరాల ప్రభుత్వ భూమిని 9మంది ప్రయివేటు వ్యక్తులకు చెందినవిగా రికార్డులు తయారుచేశారు. సుమారు రూ.1.50 కోట్లు అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. మంగళవారం ముగ్గురు తహశీల్దారులు నాగరాజు, లావణ్య, అమీద్ సస్పెండ్ చేశారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం తహశీల్దారు ప్రమీలను సస్పెండ్ చేశారు. ఒక్కసారిగా అధికారుల్లో కలవరం రేగింది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ సొమ్మును అధికారులు మింగేస్తున్నారు. ఇటీవల సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో సుమారు రూ.100కోట్లు దోచుకుతిన్న సంఘటన మరువక ముందే మరో భారీ కుంభకోణం బయటకొచ్చింది. కలువాయి మండలం, చౌటుపల్లి రిజర్వాయర్ భూసేకరణలో భారీ అవినీతి చోటుచేసుచేసుకుంది. 15ఏళ్ల క్రితం సోమశిల, కండలేరు వరద కాలువ పరిధిలో మూడు చెరువులను రిజర్వాయర్‌గా మార్పుచేశారు. కలువాయి మండలం, చౌటుపల్లి చెరువును అందులోనే కలిపారు. ఇదే సమయంలో చౌటుపల్లి, వెరుగొట్లపల్లి, వెదనపర్తి, దాచూరు గ్రామాలకు చెందిన భూముల్లో ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. మొత్తం రూ.620 ఎకరాలు ఉండగా, అందులో 150 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మరో 218ఎకరాలు పట్టా భూమిగా మిగిలింది. సిజెఎఫ్ఎస్, డికెటి భూములున్నాయి. భూమికి పరిహారం చెల్లించి ఉండగా కొంత ఆలస్యమైంది. స్థానికంగా ఉన్న కొందరు నేతలు ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కుట్రపన్నారు. ఈ కుట్రలో కలువాయిలో పనిచేసిన పలువురు తహశీల్దార్లు భాగస్వాములయ్యారు. 2018 మార్చిలో అప్పటి టిడిపి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ఇటీవల మిగిలిన వారికి పరిహారం ఇచ్చింది. ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులపై మార్చి అక్కడ పనిచేసిన తహశీల్దార్లు రూ.1.5కోట్లు మింగేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ ప్రభుత్వ భూమికి డికెటి పట్టాలు ఇవ్వడంలో అక్కడ పనిచేసిన తహశీలార్లు కీలకంగా వ్యవహరించారు. స్థానికులతో కుమ్మక్కై అంతా వ్యవహారం నడిపించారు. ఇష్టానుసారంగా వెబ్‌ల్యాండ్ మార్పు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ కుంభకోణంకు సంబంధించి విచారణ సాగుతోంది. అనేక కారణాలతో ఈ నివేదిక పక్కన పడేస్తూ వస్తున్నారు. ఆత్మకూరు ఆర్‌డిఒ, జెసిలు ఈ కుంభకోణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అన్ని రికార్డులను పరిశీలించారు. తప్పుడు రికార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును కొట్టేశారని నిర్ధారణకు వచ్చారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కాజేస్తున్నారు. జేబులు నింపుకునేందుకు నిరుపేదలకు నామాలు పెట్టి పెద్దలకు కట్టబెడుతున్నారు. ఇటీవల పొదలకూరు తహశీల్దార్ స్వాతి మండలంలో పెద్ద ఎత్తున భూఆక్రమణకు పాల్పడి బదిలీ అయినట్లు తెలిసింది. అటు తర్వాత ఎసిబి ఈ కేసును సీరియస్‌గా తీసుకొని ఆమెకు నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్నారు. తాజాగా బుచ్చి తహశీల్దార్ ప్రమీల ఓ రైతు భూమిని మరొకరికి రికార్డులు మార్పు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణ చేసి సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రభుత్వాధికారుల్లో ఎలాంటి మార్పూ రావడంలేదు. అధికారంలో ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకునే విధంగా భారీ మొత్తంలో కాజేస్తున్నారు. ఇటీవల సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో జరిగిన రూ.100కోట్ల భారీ కుంభకోణం ఇలాంటిదే. ఈ కేసులో 33మంది శిక్ష అనుభవించాల్సి వచ్చింది.

ముగ్గురు తహశీల్దార్లు సస్పెన్షన్

కలువాయి మండలంలో పనిచేసి చౌటుపల్లి రిజర్వాయర్ భూముల్లో కుంభకోణానికి పాల్పడిన ముగ్గురు తహశీల్దార్లు కలెక్టర్ చక్రధర్‌బాబు మంగళవారం సస్పెండ్ చేశారు. కలువాయిలో పనిచేసి ప్రస్తుతం వెంకటాచలం తహశీల్దార్‌గా ఉన్న నాగరాజు, మరో తహశీల్దార్ గుడ్లూరువారి పల్లిలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న లావణ్య, టిపి గూడూరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న హమీద్‌లను సస్పెండ్ చేశారు. ఈ పరిణామాలతో ఒక్కసారిగా రెవెన్యూ అధికారుల్లో కలకలం రేపింది.



విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై

ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు :ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 2023-24వ ఆర్థిక సంవత్సరానికి గాను సమర్పించిన ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ బి. వెంకటశేషయ్య తెలిపారు. మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన ఏర్పాట్లుపై ఏపిఈఆర్‌సి చైర్మన్ నాగార్జునరెడ్డి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ టెక్నికల్ సుబ్బరాజు, జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్యలు పాల్గొన్నారు. ఎస్ఈ మాట్లాడుతూ ఆన్ లైన్ విధానంలో నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జిల్లాలోని అన్ని ఆపరేషన్ డివిజన్ కార్యాలయలలో అందుబాటులో ఉంటుందన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సోమశేఖర్ రెడ్డి,బాల చంద్ర సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ శ్రీధర్,సునీల్,అశోక్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ వెంకటశేషయ్య

రాపూరులో మాజీ ఎంపి 'మేకపాటి'

ప్రజాశక్తి-రాపూరు :మండలంలోని వైసిపి నాయకులు మధు రెడ్డితో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి అతని కుమారుడు ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డిలు పలు విషయాలు చర్చించుకున్నారు. వీరితో పాటు వెంకటగిరి ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరిగ మురళీధర్, వైసిపి నాయకులు దందోలు నారాయణరెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నేడు రక్తదానం

ప్రజాశక్తి-నెల్లూరు :టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేయాలని రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ పిలుపు నిచ్చారు. మంగళవారం నగరంలోని జిల్లా టిడిపి కార్యాల యంలో రూరల్ నియోజకవర్గం క్లస్టర్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేయనున్న రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేయాలని ప్రతి డివిజన్ నుంచి అధిక శాతంలో రక్తదానం చేయాలని క్లస్టర్ ఇంచార్జి లకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి జిల్లా టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. క్లస్టర్ ఇంచార్జిలు జెన్నీ రమణయ్య, శైలేంద్ర బాబు, సురేంద్ర బాబు, పెంచల్ నాయుడు, మేకల నరేంద్ర రెడ్డి, సాబీర్ ఖాన్, కంటే సాయి బాబా, జలదంకి సుధాకర్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -పొదలకూరు

పూర్వ విద్యార్థుల కలయిక సందడిగా సాగింది. పట్టణంలోని డిఎన్ఆర్ జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో 1982-83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. పూర్వ విద్యార్థి నాయకులు తరుగు ప్రభాకర్, కాసా శ్రీనివాసులు, చొప్పా. వెంకటేశ్వర్లు, తన్నీరు. సురేష్, ఊకోటి.శ్రీహరి, కాళిదాసు,వెన్నపూస. పెంచలరెడ్డి,పులిపాటి.వెంకటేశ్వర్లు అక్కెం గోపాల్ రెడ్డి నేతత్వం వహించారు .ముఖ్య అతిథిగా ఆనాటి గణిత ఉపాధ్యాయులు సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల గణిత గురువు సుబ్బారామిరెడ్డిని సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున రూ 10 వేలు విలువైన నిత్యావసర సరుకులను నరసారెడ్డి కాలనీ గల వద్ధాశ్రమంలో అందజేశారు.



బహుమతులు అందజేత

ప్రజాశక్తి - లింగసముద్రం : సంక్రాంతి సందర్భంగా గంగపాలెం గ్రామం లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో గెలుపోందిన వారికి గ్రామ సర్పంచ్ పేలపల్లి మహేష్‌బాబు బహుమతులను అందజేశారు. క్రికెట్ పోటీల్లో గంగపాలెంలోని అంబేద్కర్ యూత్ టీమ్ మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఆ టీమ్‌కు రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో పండుగ సందర్భంగా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువకులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం సంతోషానిచ్చిందన్నారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోడూరులో కోవర్టు రాజకీయాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలో కొందరు వైసిపి నాయకులు టిడిపి కోవర్టులుగా వ్యవహరిస్తుండడంపై చర్చనీయాంశమవుతుంది. మండలంలోని కోడూరు ప్రాంతంలో వైసీపీకి చెందిన ఓ నాయకుడు తీరు అలాగే ఉంది. మండలంలో ఆ నాయకుడు వైసీపీ. కోడూరులో టిడిపికి మద్దతుగా నిలుస్తున్నారన్న ప్రచారం ఆ నేతపై సాగుతుండడం గమనార్హం. ఇటీవల కోడూరు పంచాయతీలో వైసిపి, టిడిపిల మధ్య నెలకొన్న ఓ వివాదంలో టిడిపికి మద్దతుగా నిలవడంతో ఈ వైసీపీ నేత తీరు ఆ పార్టీ క్యాడర్లో ఆందోళన కలిగిస్తోంది.కాగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ నేత అనుసరిస్తున్న విధానం పార్టీకి తీవ్ర నష్టం కలిగించేలా ఉండడం కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా కృష్ణపట్నం వాసి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో విజిలెన్స్ కమిషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నటువంటి కృష్ణపట్నం వాసి శింగమాల సుబ్రహ్మణ్యంకు మంగళవారం ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయనను అదే శాఖలో ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ కార్యాలయంలోనే ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా నియమితుల య్యారు. శింగమాల సుబ్రహ్మణ్యంకు ఉద్యోగోన్నతి లభించడంపై మిత్రులు కష్ణపట్నం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


ఎస్ సుబ్రమణ్యం

విరాళాలు అందజేత

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరులోని అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం కోసం శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కృషి చేస్తున్నారు. మంగళవారం ఆలయ నిర్మాణానికి గొల్ల శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి రూ.25,116లు విరాళంగా సంక్రాతిని పురస్కరించుకుని నిర్మాణ కమిటీ సభ్యులుకి అందజేశారు. యెనిమిరెడ్డి వెంకటరెడ్డి, దివి లింగయ్య నాయుడు, మాదాల మాల్యాద్రి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కీర్తిశేషులు ఆముదాలపల్లి కొండయ్య భార్య అచ్చమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్ళు మనుమడు మాల్యాద్రి భార్య సుబ్బరత్నం, వెంకటేశ్వర్లు భార్య నాగేంద్ర, మాధవరావు భార్య విజయలక్ష్మి కుమారుడు శివరామ ప్రసాదు కలసి రూ.51,116లు విరాళంగా నిర్మాణ కమిటీ సభ్యులు అందజేశారు. యెనిమిరెడ్డి వెంకటరెడ్డి, మంచిరాజు మురళి, మాదాల మాల్యాద్రి పాల్గొన్నారు.



రూ. 2 లక్షలు అందజేసిన 'ఇంటూరి' రాజేష్



కందుకూరు మండలం పలుకూరు పంచాయతీలో గల పత్తిపాటి వారి పాలెం గ్రామంలో ఉన్న శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మణానికి టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ రూ. 2లక్షల విరాళం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బొడపాటి అనిల్ కుమార్, కందుకూరు మాజీ మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పొడపాటి వంశీ, మద్దినేని రాఘవయ్య, ఆలయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -కందుకూరు

మండలంలోని మహదేవపురం సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి నిర్వహిం చారు. మహీధర్ రెడ్డి ప్రతి ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి వివ రించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిం చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హత ఉండి రాని పథకాలు ఏమైన ఉంటే తెలియ జేయాలన్నారు. కాకి బంగారుపాలెంలో కాలువపై మూత బండలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వర్షాలు పడినప్పుడు వాగుపై నుంచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉన్నందున తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలెంటీర్లతో సచివాలయం వద్ద సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ పి.విజయశేఖర్, తహశీల్దార్ డి. సీతారామయ్య, సర్పంచ్ కె పద్మ, ఎంపిటిసి ఎం. ఝాన్సీ, వైసిపి నాయకులు ఇంటూరి మాధవరావు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, గుళ్ళ శ్రీనివాసులు, ఇంటూరి హరిబాబు ,గంగవరపు వెంకటరావు, సూరం వేణు గోపాలరెడ్డి, సర్పంచ్‌లు ఆవుల మాధవరావు, కుమ్మర బ్రహ్మయ్య, మహ దేవపురం ఉప సర్పంచ్ నర్రా వెంకటేశ్వర్లు, కార్యదర్శి స్వప్న ఉన్నారు.



జీవితంలో భద్రత ఎంతో అవసరం

అదాని కష్ణపట్నం పోర్టు సిఇఒ జిజేరావు వెల్లడి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :జీవితంలో ప్రతిరోజూ భద్రతగా ఉండాలని ఆదానికష్ణపట్నం పోర్టు సిఇఒ జిజె రావు వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ భద్రతగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహన ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారులో ప్రయాణం సాగించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం మత్తు పదార్థాలు సేవించకుండా ప్రయాణం సాగించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటించి ప్రయాణం సాగిస్తే ప్రమాదాలను నివారించొచ్చని తెలిపారు. పోర్ట్‌లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భద్రతా చర్యలను పాటించాలని కోరారు. వారం రోజులుగా కష్ణపట్నం పోర్టులో రోడ్డు భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోర్ట్ కార్మికులు, ఉద్యోగులకు పలు రకాలుగా అవగాహన కార్యక్రమాలతోపాటు విద్యార్థులకు ఆన్లైన్ లో భద్రతపై కాంపిటీషన్స్ నిర్వహించి బహు మతులు ప్రదానం చేశారు.రోడ్డు భద్రతా వారోత్సవాల్లో కోఆర్డినేషన్ చేసిన సెక్యూరిటీ విభాగంలో కొందరికి ప్రోత్సాహాలు అందించారు. అదాని కష్ణపట్నం పోర్ట్ ఆపరేషన్స్ హెడ్ మోహిత్, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, భాస్కరన్, సెక్యూరిటీ డిజిఎం దివ్య ప్రణీత్, మనోహర్ బాబు, వెంకటేశ్వర్లు, సేఫ్టీ హెడ్ రామకష్ణ, షైఫి , నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి -వెంకటాచలం :అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెంకటాచలం సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయలనే లక్ష్యంతో ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. ప్లాట్లు మంజూరైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు.ఎంపిడిఒ సుస్మిత, తహశీల్దార్ నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి మందల వెంకట శేషయ్య, గహ నిర్మాణ శాఖ పి డి వెంకటదాస్ ఉన్నారు.



గిరిజన సర్పంచ్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

యానాదుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు :మండలంలోని అప్పారావుపాళెం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ప్రజా మద్దతుతో గెలుపొందిన గిరిజన మహిళా సర్పంచ్ సోమా కుమారిని వేధింపులకు గురిచేయడంతోపాటు విధులు నిర్వహించేందుకు కుర్చీని ఏర్పాటు చేయకుండా అవ మానిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌కి న్యాయం చేయాలని యానాదుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలోని వెన్నలకంటి రాఘవయ్య భవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య విలేకర్లతో మాట్లాడారు. ఆత్మకూరు మండలం, అప్పారావుపాళెం గిరిజన మహిళా సర్పంచ్ సోమా కుమారిని స్థానిక ఎంపిపి వేణుగోపాల్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కుర్చునేందుకు కనీసం కుర్చీ కూడా ఏర్పాటు చేయకుండా అవమాన పరుస్తున్నారన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సర్పంచ్ కు జరిగిన అవమానం, వేధింపులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. ఈ ఉదంతంపై సర్పంచ్ సోమా కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎంపిపి వేణుగోపాల్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు పేర్లను తప్పించి కేసు నమోదు చేశారన్నారు. ఎంపిపి, ఎంపిడిఓ పేర్లను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ సోమా కుమారి, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాకాని వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపూరు కష్ణయ్య, పుత్తూరు శ్రీనివాసులు, చెంబేటి ఉష, ఇండ్ల రమ్య, రమేష్, సతీష్, వేణు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెసి పెంచలయ్య

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :ఆర్యవైశ్య నాయకులు వాసవి శివగంగా నిత్యాన్నదాన ట్రస్ట్ సహాయ కార్యదర్శి గుర్రం సింగయ్య తండ్రి కోటిలింగేశ్వర 44వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక శివాలయం వద్ద పేదలకు నూతన వస్త్రాలు అందజేశారు. విప్పగుంట రోడ్డులో వ్యవసాయ మార్కెట్ పక్కన ఉన్న పేదలకు మధ్యాహ్నం ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ గుర్రం సింగయ్య తండ్రి వర్ధంతి సందర్భంగా పేదలకు ఇటువంటి కార్యక్ర మాలు చేపట్టడం అభినందనీయమన్నారు. . గుర్రం అల్లూరయ్య, ఇస్కాల మధు, చీదెండ్ల కష్ణ, చక్కా చంద్రశేఖర్ గుప్తా, చక్కా చైతన్య గుప్తా, గుర్రం సింగయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూరాయపాలెంలో 'భూ కబ్జా'

- వైసిపి నాయకుల చేతుల్లోకి 36.69 ఎకరాలు
- పశువుల మేతకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆందోళన
- స్పందించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు


కబ్జాకు గురైన భూమిని పరిశీలించి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -పొదలకూరు :మండలంలోని సూరాయ పాళెం గ్రామం లో సర్వే నెంబర్ 352లో 36.69 ఎకరాల భూమిని ఆ గ్రామంలోని కొందరు వైసిపి నాయకులు కబ్జా చేశారు. పశువుల బీడుకు ఉపయోగిస్తున్న ఆ భూమి ఆక్రమణపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం తహశీల్దార్ ఐ .ఎస్ ప్రసాద్, మండల సర్వేయర్ లాలి వెంకటేశ్వర్లు ఆర్. ఐ. నవీన్, విఆర్‌ఓ రాఘవయ్య సురాయపాలెం సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీతో కలిసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. అది పోరంబోకు భూమి అని, అందులోక ఎవరూ ప్రవేశించొద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని సంగం- చేజర్ల రహదారి పక్కన బొల్లినేని పవర్ ప్లాంట్ ఎదురుగా సర్వే నెం.352లో 36.69 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉంది. పెన్నానదికి సమీ పంలో ఉన్న ఆ భూమి విలువ ఎకరా సుమారు రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు పలుకుతోంది. గతంలో గ్రామస్తులు పశువుల మేత కోసం 36.69 ఎకరాలను మేత పోరంబోకు భూమిగా వదిలేశారు. రెవెన్యూ రికార్డుల్లోనూ మేత పోరంబోకు భూమిగానే ఉంది. ఇదే గ్రామంలోని అధికార పార్టీలోని ఓ వర్గానికి చెందిన డి హరిచంద్రారెడ్డి 10 ఎకరాల భూమిని గత నాలుగేళ్ల కిందట ఆక్రమించి సవకులు సాగు చేపట్టారు. ఎం. మల్లారెడ్డి, పి. సుబ్బారెడ్డి, బి. వెంకటేశ్వర రెడ్డి, టి. వరదారెడ్డి, జి. సుబ్రహ్మణ్యం, టి. వెంకయ్య, ఎన్. కష్ణారెడ్డి లు కలిసి16.69 ఎకరాల భూమిని ఆక్రమించారు. ఇందులో 10 ఎకరాల భూమిని జగనన్న ఇళ్లపట్టాలకు కేటాయించారు. దీంతో ఆభూమిని ఆక్రమించిన ఆక్రమణదారులు తాము ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని హైకోర్టును ఆశ్రయించి కోర్టు లో కేసు వేసి స్టే తెచ్చారు. కాగా, ఇటీవల అర్హులైన పేదలకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మిగతా భూమిపై ఆ నాయకులు కన్నేసి మేతపోరంబోకు భూమిని యంత్రాలతో చదును చేసి వరి, మామిడి పంటల సాగుకు సిద్ధపడ్డారు. పెన్నానది పక్కనే ఈ భూములు ఉండటం, సాగునీటి లభ్యత ఉండటంతో మంచి ధరలు పలుకుతు న్నాయి. ఇదే మేతపోరంబోకు భూమిలోని ఒకవైపు పేదలకు జగనన్న కాలనీ కోసం లే అవుట్లు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే సూరాయ పాలెంతోపాటు విరువూరు గ్రామస్తులకు కూడా ఈ లే అవుట్లలోనే స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించడంతో అధికార పార్టీకి చెందిన ఓ గ్రూప్ హైకోర్టు ద్వారా స్టే తెచ్చి నిలిపివేయించగలిగారు. మళ్లీ వారే ఆ భూమిని వరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. గ్రామంలో వేల సంఖ్యలో పశువులున్నా ఎక్కడా మేత మేసేందుకు వీలు లేకుండా పోయిందని, తమకు ఆ మేత పోరంబోకు భూమి 36.69 ఎకరాలే దిక్కు అని గ్రామస్థులు వాపోతున్నారు. అధికార పార్టీ నాయకుల దుశ్చర్యలను అడ్డుకునే వారిపై బెదిరింపు లకు పాల్పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఫ్లెక్సీ ఏర్పాటు చేశాం..

ఐ.ఎస్ ప్రసాద్ తహశీల్దార్, పొదలకూరు

సూరాయపాలెం గ్రామం లో మేత పోరం బోకు భూములో ఆక్రమణలను గుర్తించి ఫ్లెక్స్ ఏర్పాటు చేశాం. తాను ఇక్కడికి రాక ముందే కొంత భూమి(10 ఎకరాలు) ఆక్రమణకు గురైందని, అందులో సవక పంట సాగు చేపట్టారు. ఆ ఆక్రమణలపై పూర్తి స్థాయిలో విచారించి నోటీసులు పంపడంతో పాటు ఆ భూములోకి దిగకుండా చర్యలు తీసుకుంటాం..

కావలి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఎవరు..?

- పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ - పార్టీకి దూరంగా కొందరు.. - హ్యాట్రిక్ సాధిస్తామంటున్న నేతలు



రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదాల ప్రభాకర్ రెడ్డి వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

ప్రజాశక్తి-అల్లూరు

కావలి నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతూ రసవత్తరంగా మారుతున్నాయి. కాగా ఇందులో పూర్తి సమాచారం అధికార పార్టీ అభ్యర్థిపై ప్రజలు, ప్రతిపక్షాలు స్వయానా పార్టీ నేతలే ఉత్కంఠగా చర్చించుకుంటున్నారు. ప్రధానంగా నడుస్తున్న హాట్ టాపిక్ ఏమిటంటే.. ఈ దఫా జరిగే ఎన్నికల్లో ప్రస్తుత అధికార పార్టీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వరంటూ ప్రచార భోగట్టా. కొంతమంది మాత్రం తమ ఎంఎల్‌ఎ హ్యాట్రిక్ సాధించి తీరుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రోజులు దగ్గరపడే కొద్దీ కావలి నియోజకవర్గంపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి అలాగే రాజ్యసభ సభ్యులైన బీద మస్తాన్‌రావు తనయుడికి అధికార పార్టీ టికెట్ కేటాయిస్తారంటూ విస్తృత ప్రచారం సాగుతోంది. ఆయా వర్గాలకు చెందిన నేతలు బహిరంగ వ్యాఖ్యలు గుప్పిస్తున్నారు. పైకి వైసిపి పార్టీలో వర్గ భేదాలు లేవంటూ కొంతమంది నేతలు పైకి చెబుతున్నప్పటికీ ఆ పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరిన తరుణంలో ముఖ్య నేతలు కొంతమంది పార్టీకి దూరంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పుడు నుండి కావలి మాజీ ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి అంతా తానై నడిపిస్తున్నారని కొంతమంది నేతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకులుగా ఉంటూ అధికార పార్టీలో కొనసాగుతున్న కావలి ఎంఎల్‌ఎకు తాముకానీ తమపేర్లు కానీ గుర్తులేవని వైసిపి నాయకులు కొందరు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కొంతమందిని మాత్రమే దగ్గరకు చేరదీస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని ఇవన్నీ సరిదిద్దుకోకపోతే భవిష్యత్తులో విజయం సాధించాలంటే కష్టతరమని వారంటున్నారు. అల్లూరు మండలానికి చెందిన ఒక వైసిపి సీనియర్ నేత స్వయంగా జగన్మోహన్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ దందా, భూ కుంభకోణాలపై వివరించినట్లు, పార్టీలోని కొంతమంది నేతలు బహిరంగ ఘంటాపథంగా చెప్పుకుంటున్నారు. ఆ నాయకుడు వైసిపి గడ్డుకాలంలో ఉన్న నాటినుండి అనేక సేవలు చేశారని అలాంటి వ్యక్తిని పక్కన పెట్టారంటూ ఆయన వర్గీయులు వెల్లడించారు. ఇటీవల కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అల్లూరు మండలంలో గడపగడప కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనగా ప్రజల నుండి నేరుగా సమస్యలను తెలుసుకునే క్రమంలో కొంతమేరకు ప్రతిస్పందన వచ్చినప్పటికీ సుకుమార్‌రెడ్డికే అంతా క్రెడిట్ అంటూ భారీ స్థాయిలో విస్తృత ప్రచారం సాగింది. పైగా ఆయన ఉంటేనే జనాలు ఉంటారంటూ అనుకోవడంతో కొద్దిరోజుల తర్వాత చివరి క్షణాలలో పాల్గొంటూ వస్తున్నారని పలువురు తెలియజేశారు. అర్ధాంతరంగా 'గడప గడపకు' కార్యక్రమం ఆగిపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోందని కొందరు తెలియజేస్తున్నారు. నియోజకవర్గంలో ఎంతోమంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న క్రమంలో రైతు ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లేకపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా.. ఏమీ చేయలేని స్థితిలో పాలకులు ఉండిపోయారని ఈ దుర్మార్గాన్ని ఎన్నడూ చూడలేదని ఆగ్రహావేశాలు వ్యక్తపరుస్తున్నారు. ఒక సొసైటీ నూతన భవనాన్ని ప్రారంభించే క్రమంలో కావలి ఎంఎల్‌ఎ అప్పటి మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై మద్దతు ధరపై విమర్శనాస్త్రాలు గుప్పించారని ఒకరిపై ఒకరు విమర్శలు తప్పితే రైతులకు చేసిన మేలేమిటని ప్రశ్నించారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసినకొన్ని ఫ్లెక్సీలలో రాజ్యసభ సభ్యులు మస్తాన్ రావు ఫొటోలు కనిపించలేదని పుకార్లు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైనా మించిపోయింది ఏమీలేదని ఇలాంటి పొరపాట్లను సరిదిద్దుకోవాలని కోరుతున్నారు. ఏదేమైనా కావలి వైసిపి అభ్యర్థి టికెట్ ఎవరికి అంటూ ప్రజల్లో విస్తృత చర్చ సాగుతోంది. అంతేకాకుండా అధిష్టానం ఈ ఉత్కంఠకు తెరతీసి అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తే బాగుంటుందని కొంత మంది పార్టీ విధేయులు అంటున్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-కావలి

ప్రియదర్శిని మహిళామండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర నెల్లూరు వారి సౌజన్యంతో నిర్వహించిన కంప్యూటర్ కోర్స్ శిక్షణ పొందిన 20మంది మహిళలకు మంగళవారం కావలి విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రియదర్శిని మహిళామండలి అధ్యక్షులు ఖాదర్‌బీ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. అలాగే నెహ్రూ యువ కేంద్ర నెల్లూరు వారిద్వార ఈ ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేసి, వారికి శిక్షణ ఇచ్చి, ఈ రోజు నిరుద్యోగ, యువతీ యువకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. మీరందరూ ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు, సర్టిఫికెట్లు ఎంతోఉపయోగ పడుతాయన్నారు. కావున సద్వినియోగం చేసుకోవాలని సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఖాదర్ బాషా, ప్రియదర్శిని మహిళామండలి అధ్యక్షులు, ఖాదర్‌బీ, రహీమ్ చారిటబుల్ ట్రస్ట్, అలీం అహమ్మద్, హ్యాపీ స్వచ్ఛంద సంస్థ ఘని బాషా, ఎంపిజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రఫీ అహమ్మద్, జాగో స్వచ్ఛంద సంస్థ జమీర్, గుడ్‌మెన్ చారిటబుల్ ట్రస్ట్ బ్రహ్మయ్య, టైమ్ టూ హెల్ప్ సంస్థ రమేష్, సర్టిఫికెట్ లబ్ధిదారులు, 20మంది హాజరయ్యారు.

ఆదర్శప్రాయంగా డాక్టర్ మధుమోహన్

- ప్రభుత్వాసుపత్రిలోనే డాక్టర్ సతీమణికి కాన్పు

ప్రజాశక్తి-వింజమూరు



పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే డాక్టర్ మధుమోహన్ తన భార్య సుజాతను ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుకు తీసుకొచ్చి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వింజమూరు స్థానిక వైద్యశాలలో పని చేసే డాక్టర్ మధుమోహన్ తన జీవిత భాగస్వామిని వేరే ప్రయివేట్ తీసుకుపోకుండా ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయడం, అందరికీ ఇక్కడ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తున్నారు. మండల ప్రజలందరూ స్థానికంగా వైద్యశాలలో ఉన్న వైద్య సదుపాయాలను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. 11వ తేదీన నొప్పులు రావడంతో స్థానిక వైద్యులకు తీసుకురాగా డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో సిజేరియన్ ద్వారా బేబీగర్ల్‌కు జన్మనిచ్చారు.

నేడు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-కోవూరు : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనే నెల్లూరు జిల్లా సీనియర్ స్త్రీలు, పురుషుల జట్టు ఎంపికలు బుధవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్ జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ టి.లవకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు ఈ నెల 25, 26, 27 తేదీలలో విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి దగ్గర అంకుపాలెంలో జరిగే 70వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు వచ్చే స్త్రీల బరువు 75 కేజీల లోపు, పురుషుల బరువు 85 లోపు ఉండాలని తెలిపారు. సెలెక్షన్స్ రోజున ఆధార్ కార్డ్ తప్పకుండా తీసుకు రావాలని పేర్కొన్నారు.

డ్రెస్‌కోడ్ పాటించని 9మందికి మెమోలు

ప్రజాశక్తి-కావలి : విధుల్లో డ్రెస్‌కోడ్ పాటించనందుకు 6, 7వ సచివాలయాల్లో పని చేస్తున్న 9మంది సిబ్బందికి మెమోలు ఇస్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి ప్రకటనలో తెలిపారు. కాగా మంగళవారం ఆయన 6, 7 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా, డ్రెస్‌కోడ్ పాటించలేదు. ఆది గుర్తించి, కమిషనర్ వారిపై తగు చర్యల నిమిత్తం 9మంది సిబ్బందికి మెమోలు జారీచేసినట్లు ప్రకటనలో తెలియజేశారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-వింజమూరు : పట్టణంలోని కార్లర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. వివిధ మండలాల నుండి 26 టీములు ఈ పోటీల్లో పాల్గొనగా బుచ్చి ఫైనల్ విజేతగా నిలిచింది. పట్టణంలోని జెడిపి బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఫైనల్‌కు చేరుకున్న బుచ్చిరెడ్డిపాళెం బివిఆర్ స్పోర్ట్స్ అకాడమి టీం, వింజమూరు వివిఆర్ కబడ్డీ అసోసియేషన్ టీములకు కార్లర చారిటబుల్ ట్రస్ట్ అధినేత కార్లర సురేష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి రూ.40,116, ఎస్.సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించిన బుచ్చిరెడ్డిపాళెం నిలచిన వింజమూరు వివిఆర్ కబడ్డీ అసోసియేషన్ టీములకు రెండవ బహుమతి రూ.30,116, ఎస్.సిద్ధిక్ కెప్టెన్‌గా వ్యవహరించిన వింజమూరు-2 టీం అండ్ జి.పవన్ ఆలీవ్ క్లబ్ బుచ్చిరెడ్డిపాళెం, రెండు టీములకు మూడవ బహుమతి రూ.15,116 మొదలగు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వింజమూరు కబడ్డీ అసోసియేషన్ సుసుమ్ సిద్దీక్, అప్పసముద్రం వీర బ్రహ్మచారి, రిఫరీలుగా వెలుగోటి కృష్ణ, నరగుంట ప్రభాకర్ రెడ్డి, పెద్దపత్తన క్రీడాకారులు పాల్గొన్నారు.



అప్పారావుపాళెంలో విచారణ

ప్రజాశక్తి-ఆత్మకూరురూరల్ : మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో ఇరు వర్గాల ఒకరిపై ఒకరు కుల దూషణ పేరుతో ఫిర్యాదు చేయడంతో వారిపై అట్రాసిటీ కేసులు నమోదు కావడంతో ఆ విషయంపై ఆత్మకూరు డిఎస్‌పి కోటారెడ్డి, నెల్లూరు దిశ డిఎస్‌పి సురేష్ బాబులు మంగళవారం బాధితులను సచివాలయానికి పిలిపించి ప్రత్యేకంగా విచారణ చేశారు. విచారణ చేపట్టి రికార్డులో నమోదు చేసుకున్నారు. ఇటీవల పంచాయతీ సమావేశంలో జరిగిన చిలికి మద్దత తదనంతర ఓ వ్యక్తి సమావేశం హాల్లోకి వచ్చేందుకు ప్రయత్నించారని అలా రాకూడదని చెబుతున్న పంచాయతీ కార్యదర్శి పుట్టు నరసింహులపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడు. దీనికి తోడు అతనికి సంబంధం లేకుండా పంచాయతీ సమావేశాన్ని వెలుపల నుండే వీడియోలు ఫొటోలు తీయడం లాంటివి చేశాడు. దీంతో కార్యదర్శి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో తమను కులం పేరుతో దూషించిన విషయమన్ని ఫిర్యాదు చేశాడు. ఇదే క్రమంలో స్థానిక సర్పంచ్ సోమా కుమారి టిడిపి మద్దతుదారుడి ప్రోద్బలంతో తనను కులం పేరుతో స్థానిక నాయకులు దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ రెండు కేసులను నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో మంగళవారం ఇతర డిఎస్‌పిలు గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 18వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు హాజరుకావాలని తెలియజేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని ముంగమూరు గ్రామంలో ఉన్న పోలేరమ్మ దేవతకు మంగళవారం గ్రామస్తులు పొంగళ్లు నైవేద్యంగా అందించారు. గ్రామ సర్పంచ్ రాయి వినోద్‌యాదవ్ సుప్రజా దంపతులు నూతన వస్త్రాలను, కాయ కర్పూరంతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి-బిట్రగుంట : మానసిక వికాసానికి క్రీడలు అవసరమని కావలి శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో సంక్రాంతి పండుగ సందర్భంగా యంగ్‌లైన్స్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు రామిరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంగ్‌లైన్స్ కమిటీ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామంలో క్రీడలను నిర్వహించి సంక్రాంతి పండుగను ఎంతో ఆనందంగా యంగ్‌లైన్స్ కమిటీ వారు జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గంధం మంజుల, గంధం శ్రీనివాసులు, ఉపసర్పంచ్ పెంట్ల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పేట శ్రీధర్, సాగర్, రైల్వే విశ్రాంతిఉద్యోగి సత్యం, పి.రవి, గ్రామస్తులు, తదితరులున్నారు.



క్రీడాకారుడికి క్రమశిక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి-కోవూరు : ప్రాథమిక దశ నుండి ప్రతి క్రీడాకారుడికి క్రమశిక్షణ తప్పనిసరి అని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులు రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి పర్వదిన సందర్భంగా పెద్ది ప్రభావతి మెమోరియల్ ఆధ్వర్యంలో కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల స్థాయిలో నిర్వహించిన షటిల్ పోటీ విజేతలకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పెద్ది మారుతి నిర్వాహకులు పలు విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో అవినాష్ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీనివాసులు, నిరంజన్, దయాకర్, పవన్ సాయి, పవన్, సుమధర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే... : కోవూరులోని మండల పరిషత్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన షటిల్ పోటీలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ప్రథమ స్థానాన్ని జోసఫ్ నూతనలు కైవసం చేసుకున్నారు. వీరికి రూ.10,116లు, మెమెంటోలు. మెడల్స్ ను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులు రెడ్డి పంపిణీ చేశారు. రెండో బహుమతి నాని అండ్ శ్రీకాంత్, మూడో బహుమతి అవినాష్ అండ్ మస్తాన్ కైవసం చేసుకున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి బిట్రగుంట : బోగోలు మండలం శ్రీ వెంకటేశ్వరపాలెం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరలో పరిష్కరించేటట్లుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిపి గోవిందరాజు, ఎంపిటిసి ఎకె సుందర రాజ్, గ్రామసర్పంచ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డిడిఒ లీలావతికి మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి ఫర్దిన్ బాషా, మన ఫౌండేషన్ సభ్యులు బాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్‌లో నూతనంగా నలుగురు వైద్యులు నియామకం చాలా సంతోషించామన్నారు. ఈ మారుమూల ప్రాంతంలో ఉన్న నిరుపేద రోగులకు మంచి వైద్యం అందుతుందని ఆనందం వ్యక్తం చేశామన్నారు. కాని దానికి విరుద్ధంగా వైద్యులు ఎవరుకూడా పూర్తి సమయం వైద్యశాలలో అందుబాటులో లేక అత్యవసర పరిస్థితులలో వచ్చిన దూరంతాలైన ఆత్మవారు, నెల్లూరు వైద్యశాలలకు వెళ్లమని సలహాలు ఇవ్వడంతో అనేక మంది పేద ప్రజలకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. కావున వైద్యశాలలో వైద్యులందరూ తమ సమయాన్ని 9:00 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విధి నిర్వహణలో ఉండి పేదలకు వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఎన్‌టిఆర్ వర్ధంతి విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి



తెలుగు జాతి ముద్దుబిడ్డ నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతన బోయిన బయన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో 11 గంటలకు మండల కమిటీ అధ్వర్యంలో మహనీయులు వర్ధంతి వేడుకలు జరుగుతాయన్నారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఎ బొలినేని రామారావు చేతుల మీదుగా అన్నదాన చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని వర్ధంతిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు, మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామి రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు.

ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జిల్లాలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదనే బృహత్తర లక్ష్యంతో పనిచేస్తున్నామని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం బుచ్చిరెడ్డి పాలెం మండలంలోని కట్టుబడివారిపాలెం జగనన్న కాలనీల్లో నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రతి శనివారం హౌసింగ్ డేగా నిర్ణయించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సచివాలయ స్థాయిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ నుంచి జిల్లా స్థాయి అధికారి, ప్రత్యేక అధికారుల వరకు గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అధికారులందరూ పాల్గొని పనులు వేగవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తూ ఎటువంటి పెండింగు లేకుండా చూస్తున్నామన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణానికి వడ్డీలేని రుణాన్ని అందిస్తున్నామన్నారు. పేద ఎస్‌టి కుటుంబాలకు సిఎస్‌ఆర్ నిధుల నుంచి అదనపు నగదు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ సౌకర్యాలను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకొని ఇళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా నుడా పరిధిలోకి వచ్చిన వారికి కూడా ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 63 వేల మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇంకా ఎవరైనా ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. ఇళ్లు నిర్మాణం పూర్తయిన వెంటనే ఆయా కాలనీలలో అంతర్గత మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాబోవు ఉగాది నాటికి గృహప్రవేశం చేయడానికి లబ్ధిదారులకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సుధాకర్, బుచ్చి నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఒ నరసింహారావు, తహశీల్దార్ పద్మజ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

పెంచిన ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి జనార్ధన్ తెలియజేశారు. ఈ సేకరణ 19, 20 తేదీలలో ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయం ఆత్మకూరులో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్నం నుండి బహిరంగంగా నిర్వహిస్తామన్నారు.

జర్నలిస్టుపై దాడి అమానుషం

ప్రజాశక్తి-జలదంకి

కొండాపురం విశాలాంధ్ర జర్నలిస్టు మదన్‌పై దాడి అమానుషమని, నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగా నేపథ్యంలో కోడి పందేల నిర్వహణ స్థావరాలను కవర్ చేయడానికి వెళ్లిన విశాలాంధ్ర జర్నలిస్టు మదన్‌పై కొందరు దాడి చేశారన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై వార్తలు రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టుపై దాడి చేయటం దారుణం పోలీసు స్టేషన్లలో పిర్యాదు చేసిన స్పందించని పోలీసులు జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

వవ్వేరు కో-ఆపరేటివ్

చైర్మన్ పదవికి 'సూరా' రాజీనామా

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



రాజీనామా పత్రం చూపుతున్న సూరా శ్రీనివాసులరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులు రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. మరో 10 రోజుల్లో పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి బ్యాంకు చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన పదవీ కాలంలో తనకు సహకరించి అధికారులకు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు. తన 10 ఏళ్ల పదవీ కాలంలో బ్యాంకు అభివృద్ధికి విశేషంగా కృషి చేశానని వెల్లడించారు. ఆయన్ను చైర్మెన్ పదవి నుండి సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నందునే ముందుగానే రాజీనామా చేసినట్లు ప్రచారం సాగుతోంది. బ్యాంకు సంబంధించిన నగదును తన సొంతానికి వాడుకున్నట్లు గతంలో ఆయనపై అభియోగాలు ఉన్నాయి. ఈ అభియోగాలపై సహకార శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. విచారణలో భాగంగా ఆయన సహకార శాఖ నుంచి నోటీసులు కూడా అందుకున్నారు. విచారణ కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో అనూహ్యంగా సూరా శ్రీనివాసులు రెడ్డి రాజీనామా చేశారు. సూరా శ్రీనివాసులు రెడ్డి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడుగా ఉన్నారు.



లీజుకు ఆర్‌టిసి స్థలాలు

ప్రజాశక్తి-కావలి

కావలి ఎపిఎస్ ఆర్‌టిసి డిపో పరిధిలోని ఉలవపాడు బస్టాండ్ ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని 15 సంవత్సరాల కాలవ్యవధితో వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన కేటాయించడానికి టెండర్లను పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 2వ తేదీ లోపు టెండర్ ఫారాలను కొనుగోలు చేయాలని, 3వ తేదీ నెల్లూరులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో టెండర్ దాఖలు చేయాలనీ వివరించారు. సదరు స్థలంలో ఏ వ్యాపారం అయినా చేయవచ్చని, సబ్‌లీజ్‌కు కూడా ఇచ్చుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు, టెండరు ఫారాలకు సమీప డిపోలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన సంక్రాంతి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరులో ప్రముఖ రాజకీయ నాయకులు సుబ్బరాజు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ముద్దులూరు వెంకటరాజు స్మారక సంక్రాంతి క్రీడా పోటీలు మంగళవారం ఎంతో ఘనంగా ముగిశాయి. హోరాహోరీగా జరిగిన క్రికెట్ పోటీల్లో చుంచులూరు గ్రీన్‌స్టార్స్ జట్టు మొదటి స్థానంతో విన్నర్స్ ట్రోఫీని సాధించగా, రాజుపాలెం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రాజుపాలెం జట్టుకు చెందిన సురేష్, బెస్ట్ బౌలర్‌గా చుంచులూరు జట్టుకు చెందిన షమీర్ ప్రతిభ చూపారు. బాల్ బ్యాడ్మింటన్‌లో చుంచులూరు ఏ జట్టు మొదటి స్థానం, చుంచులూరు బి జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. బెస్ట్ ప్లేయర్‌గా సుమన్ ఎంపికయ్యారు. అట్టహాసంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు, ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ అని, నేటి సమాజంలో సంప్రదాయాలు, మానవ సంబంధాలు క్రమేణా తగ్గిపోతున్నాయని, వాటిని మళ్లీ పెంపొందించా లంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తప్పనిసరి అని, మానసిక శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని తెలియజేశారు. ప్రముఖ రాజకీయ నాయకులు సుబ్బరాజు మాట్లాడుతూ పల్లెటూర్లు దేశానికి పట్టుకొమ్మలని, సంక్రాంతి పండుగను అందరూ కలసి పల్లెటూర్లలో సరదాగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, రంగవల్లుల పోటీలు, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, షటిల్ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పార్వతీపురం శ్రీను, సింగర్ రూప బృందం వారితో ప్రదర్శించబడిన జానపద పాటలు, నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సుబ్బరాజు బంధుమిత్రులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎంఎల్‌ఎ జోలికొస్తే ఊరుకునేది లేదు..

ప్రజాశక్తి-విడవలూరు : కోవూరు శాసన సభ్యులు నలపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి జోలికి వస్తే ఊరుకునేది లేదని సమావేశంలో వైసిపి నాయకుడు పుండ్ల అచ్యుత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వైసిపి నాయకులు మాట్లాడుతూ టిడిపి నాయకులు ఆ పార్టీకి చెందిన మరొక వ్యక్తి ఫోనులో తిట్టుకుంటే విడవలూరు పోలీస్ స్టేషన్లో ప్రెస్‌మీట్‌లు పెట్టి టిడిపి నాయకులు పిలిపించి కోవూరు ఎంఎల్‌ఎ జోలికి రావడం సరికాదని హెచ్చరించారు. టిడిపిలో గొడవలు ఉంటే మీరు మీరు చూసుకోవాలని మధ్యలో వైకాపా జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొండూరు వెంకట సుబ్బారెడ్డి, రామిరెడ్డి విజయ్ భానురెడ్డి, నవీన్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలున్నారు.



నేడు షూటింగ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాస్థాయి శాప్ షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం నుంచి జరుపుతున్నట్లు శాప్ జిల్లా సిఇఒ పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. అండర్-17 సబ్ జూనియర్స్ అండర్ -21 బాల బాలికల విభాగాల్లో స్థానిక జడ్‌పి హైస్కూల్ ముసునూరువారిపాళెం (ముత్తుకూరు) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 21న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 21 షూటింగ్ బాల్ లీగ్ నెల్లూరు తరుపున న్యాయకత్వం వహిస్తారన్నారు. అండర్-17 బాలబాలికలు ఎంపికైన క్రీడాకారులు 29 నుంచి 31 వరకు బాపట్లలో జరిగే శాప్‌లీగ్ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలల్లో నెల్లూరు జిల్లా తరుపున ప్రాతినిత్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో హజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు బి.లవ్‌కుమార్ 8341348878 సంప్రదించాలని కోరారు.